10-05-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - తండ్రి సమానముగా దయార్ద్ర హృదయులుగా అవ్వండి, దయార్ద్ర హృదయులైన పిల్లలు అందరినీ దుఃఖాల నుండి విడిపించి పతితము నుండి పావనముగా తయారుచేసే సేవను చేస్తారు"

ప్రశ్న:- మొత్తం ప్రపంచము యొక్క కోరిక ఏమిటి, దానిని తండ్రి తప్ప ఇంకెవ్వరూ పూర్తి చేయలేరు?

జవాబు:- మొత్తం ప్రపంచమంతటి కోరిక - శాంతి మరియు సుఖము లభించాలి అని. పిల్లలందరి పిలుపును విని తండ్రి వస్తారు. బాబా అనంతమైనవారు, అందుకే - నా పిల్లలు దుఃఖితుల నుండి సుఖవంతులుగా ఎలా అవుతారు అన్న చింత వారికి ఉంటుంది. బాబా అంటారు - పిల్లలూ, పాత ప్రపంచము కూడా నాదే, అందరూ నా పిల్లలే, నేను అందరినీ దుఃఖాల నుండి విడిపించేందుకు వచ్చాను. నేను మొత్తం ప్రపంచమంతటికీ యజమానిని, దీనిని నేనే పతితము నుండి పావనముగా తయారుచేయాలి.

ఓం శాంతి. తండ్రి పిల్లలను పావనముగా తయారుచేస్తున్నారు. కావున తప్పకుండా తండ్రిపై ప్రేమ ఉండాలి. సోదరులకు పరస్పరం ప్రేమ ఉండడం మంచిదే. ఒక్క తండ్రి పిల్లలు అందరూ పరస్పరం సోదరులవుతారు. కానీ పావనముగా తయారుచేసేవారు ఒక్క తండ్రే, అందుకే పిల్లలందరి ప్రేమ ఒక్క తండ్రి వైపుకే వెళ్ళిపోతుంది. తండ్రి అంటారు - పిల్లలూ, నన్నొక్కరినే స్మృతి చేయండి. మీరందరూ సోదరులే, అది నిజమే, కావున తప్పకుండా క్షీర ఖండముగానే ఉంటారు. మీరు ఒకే తండ్రి పిల్లలు. ఆత్మలోనే అంతటి ప్రేమ ఉంది. మీరు దేవతా పదవిని పొందుతున్నారు కావున పరస్పరం చాలా ప్రేమ ఉండాలి. మనం సోదరులుగా అవుతాము. తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకుంటాము. తండ్రి వచ్చి నేర్పిస్తారు. అర్థం చేసుకునేవారు ఎవరైతే ఉంటారో వారు, ఇది స్కూల్ లేక పెద్ద యూనివర్శిటీ అని అర్థం చేసుకుంటారు. తండ్రి అందరికీ దృష్టిని ఇస్తారు మరియు తలచుకుంటారు. అనంతమైన తండ్రిని మొత్తం ప్రపంచమంతటిలోని మనుష్యమాత్రుల ఆత్మలు స్మృతి చేస్తాయి. కొత్తదైనా లేక పాతదైనా అంతా ఆ తండ్రి ప్రపంచమే. కొత్త ప్రపంచము తండ్రిదైనప్పుడు మరి పాతది తండ్రిది కాదా? తండ్రే అందరినీ పావనముగా తయారుచేస్తారు. పాత ప్రపంచము కూడా నాదే. మొత్తం ప్రపంచమంతటికీ యజమానిని నేనే. నేను కొత్త ప్రపంచములో రాజ్యం చేయకపోయినా కానీ అది నిజానికైతే నాదే కదా. నా పిల్లలు నా ఈ పెద్ద ఇంట్లో కూడా ఎంతో సుఖముగా ఉంటారు, ఆ తరువాత మళ్ళీ దుఃఖాన్ని కూడా పొందుతారు. ఇది ఒక ఆట. ఈ మొత్తం అనంతమైన ప్రపంచమంతా మన ఇల్లు. ఇదొక పెద్ద రంగస్థలం కదా. ఈ ఇల్లు అంతటిలోనూ నా పిల్లలు ఉన్నారు - అని తండ్రికి తెలుసు. వారు మొత్తం ప్రపంచమంతటినీ చూస్తారు. అందరూ చైతన్యముగా ఉన్నారు. పిల్లలందరూ ఈ సమయంలో దుఃఖితులుగా ఉన్నారు, అందుకే పిలుస్తారు - బాబా, మమ్మల్ని ఈ ఛీ-ఛీ దుఃఖమయ ప్రపంచము నుండి శాంతిమయమైన ప్రపంచములోకి తీసుకువెళ్ళండి, ఓ శాంతిదేవా. తండ్రినే అలా పిలుస్తారు. దేవతలనైతే అలా అనలేరు. అందరికీ వారొక్కరే తండ్రి. వారికి మొత్తం సృష్టి అంతటి చింతా ఉంటుంది. ఇది అనంతమైన ఇల్లు. ఈ అనంతమైన ఇంట్లో ఈ సమయంలో అందరూ దుఃఖితులుగా ఉన్నారు, అందుకే శాంతిదేవ, సుఖదేవ అని అంటారని పిల్లలకు తెలుసు. ఈ రెండింటినీ కోరుకుంటారు కదా. మనం అనంతమైన తండ్రి నుండి సుఖ వారసత్వాన్ని తీసుకుంటున్నామని ఇప్పుడైతే మీకు తెలుసు. తండ్రి వచ్చి మనకు సుఖాన్ని కూడా ఇస్తారు, అలాగే శాంతిని కూడా ఇస్తారు. ఈ విధముగా సుఖ-శాంతులను ఇచ్చేవారు ఇంకెవ్వరూ లేరు. తండ్రికే దయ కలుగుతుంది. వారు అనంతమైన తండ్రి. తండ్రి పిల్లలమైన మనం పవిత్రముగా ఉన్నప్పుడు చాలా సుఖవంతులుగా ఉండేవారమని మీరు భావిస్తారు. ఇప్పుడు అపవిత్రముగా అవ్వడం వలన దుఃఖితులుగా అయిపోతారు. కామ చితిపై కూర్చొని నల్లగా, పతితులుగా అయిపోతారు. ముఖ్యమైన విషయమేమిటంటే, తండ్రినే మర్చిపోతారు. ఏ తండ్రి అయితే ఇంతటి ఉన్నత పదవిని ఇచ్చారో వారినే మర్చిపోతారు. నీవే తల్లివి, తండ్రివి అని గానం చేస్తారు కూడా కదా. అప్పుడు అపారమైన సుఖాలు ఉండేవి, వాటిని మీరు ఇప్పుడు మళ్ళీ తీసుకుంటున్నారు ఎందుకంటే ఇప్పుడు అపారమైన దుఃఖాలు ఉన్నాయి. ఇది తమోప్రధాన ప్రపంచము. విషయసాగరములో మునకలు వేస్తూ ఉంటారు. కానీ ఏమీ అర్థం చేసుకోరు. ఇప్పుడు మీకు అర్థమయ్యింది. ఇది రౌరవ నరకమని మీరు అర్థం చేసుకుంటారు.

ఇప్పుడు మీరు నరకవాసులా లేక స్వర్గవాసులా? అని తండ్రి పిల్లలను అడుగుతారు. ఎవరైనా మరణించినప్పుడు వెంటనే, స్వర్గస్థులయ్యారు అని అనేస్తారు, అనగా అన్ని దుఃఖాల నుండి దూరమయ్యారు అని అర్థము. మరి మళ్ళీ నరకము యొక్క వస్తువులను వారికి ఎందుకు తినిపిస్తారు? ఇది కూడా అర్థం చేసుకోరు. తండ్రి వచ్చి స్వర్గ స్థాపనను చేస్తారు. పిల్లలైన మీకు రాజయోగాన్ని నేర్పిస్తారు. తండ్రి అంటారు - మధురమైన పిల్లలూ, నేను మీకు ఈ జ్ఞానాన్ని

వినిపిస్తాను, నాలోనే ఈ జ్ఞానం ఉంది, జ్ఞానసాగరుడిని నేనే. ఫలానావారు శాస్త్రాల అథారిటీ అని అంటారు, కానీ వారు కూడా ఆత్మలే కదా, అది కూడా అర్థం చేసుకోరు. తండ్రి గురించే వారికి తెలియదు. ఏ తండ్రి అయితే విశ్వాధిపతులుగా తయారుచేస్తారో, వారి గురించి - వారు రాయి, రప్పలన్నింటిలోనూ ఉన్నారు అని అనేస్తారు. వ్యాస భగవానుడు ఏమేమో విషయాలను వ్రాసేసారు. మనుష్యులకు ఏమీ తెలియదు. పూర్తిగా అనాథలుగా అయి పరస్పరం గొడవపడుతూ-కొట్లాడుకుంటూ ఉంటారు. రచయిత అయిన తండ్రి మరియు రచన యొక్క ఆదిమధ్యాంతాల గురించి ఎవ్వరికీ తెలియదు. తండ్రి తమ మరియు రచన యొక్క ఆదిమధ్యాంతాల రహస్యాన్ని అర్థం చేయిస్తారు. ఈ విషయాలను ఇంకెవ్వరూ తెలియజేయలేరు. మీరు ఎవ్వరినైనా అడగండి - ఎవరినైతే ఈశ్వరుడు, భగవంతుడు, రచయిత అని అంటున్నారో వారిని గురించి మీకు తెలుసా? రాయి, రప్పల్లో ఈశ్వరుడు ఉన్నారు అని అనడమే ఆయనను తెలుసుకోవడమా? మొదట స్వయాన్ని అయితే అర్థం చేసుకోండి. మనుష్యులు తమోప్రధానముగా ఉన్నారు కావున జంతువులు మొదలైనవన్నీ కూడా తమోప్రధానముగా ఉన్నాయి. మనుష్యులు సతోప్రధానముగా ఉన్నప్పుడు అన్నీ సుఖవంతముగా అయిపోతాయి. మనుష్యులను బట్టి వారి ఫర్నీచర్ కూడా ఉంటుంది. షావుకారుల ఫర్నీచర్ కూడా బాగుంటుంది. మీరైతే పూర్తిగా సుఖవంతులుగా, విశ్వాధిపతులుగా అవుతారు, కావున మీ వద్ద ప్రతి వస్తువూ సుఖమిచ్చేదిగా ఉంటుంది. అక్కడ దుఃఖమిచ్చే వస్తువేదీ ఉండదు. ఈ నరకము అశుద్ధమైన ప్రపంచము.

భగవంతుడు ఒక్కరేనని, వారే పతిత-పావనుడని, వారే స్వర్గ స్థాపనను చేస్తారని తండ్రి వచ్చి అర్థం చేయిస్తారు. దేవతల మహిమను కూడా - సర్వ గుణ సంపన్నులు... అని గానం చేస్తారు. మందిరాలలోకి వెళ్ళి దేవతల మహిమను, స్వయం యొక్క నిందను చేస్తారు ఎందుకంటే అందరూ భ్రష్టాచారులుగా ఉన్నారు. శ్రేష్ఠాచారులు, స్వర్గవాసులు అయితే ఈ లక్ష్మీ-నారాయణులే, వారినే అందరూ పూజిస్తారు. సన్యాసులు కూడా పూజిస్తారు. సత్యయుగములో అలా జరుగదు. మీది అనంతమైన సన్యాసము. అనంతమైన తండ్రి వచ్చి అనంతమైన సన్యాసాన్ని చేయిస్తారు. అది హఠయోగము, హద్దు సన్యాసము, ఆ ధర్మమే వేరు. తండ్రి అంటారు - మీరు మీ ధర్మాన్ని మర్చిపోయి ఎన్ని ధర్మాలలోకి దూరిపోయారు. మన భారత్ పేరును కూడా హిందుస్థాన్ అని పెట్టేసారు, అంతేకాక హిందూ ధర్మము అని అనేశారు. వాస్తవానికి హిందూ ధర్మాన్ని ఎవ్వరూ స్థాపించనే లేదు. ముఖ్యమైన ధర్మాలు నాలుగు - దేవీ-దేవత, ఇస్లాం, బౌద్ధ మరియు క్రిస్టియన్ ధర్మాలు. ఈ ప్రపంచమంతా ఒక ద్వీపమని, ఇందులో రావణ రాజ్యముందని మీకు తెలుసు. రావణుడిని చూసారా? అతడిని పదే, పదే కాలుస్తారు, అతను అందరికన్నా పాత శత్రువు. అతడిని వారు ఎందుకు కాలుస్తారు అన్న విషయము కూడా అర్థం చేసుకోరు. అసలు అతను ఎవరు? అతడిని ఎప్పటి నుండి కాలుస్తూ వచ్చారు? ఇది తెలియాలి కదా. పరంపరగా కాలుస్తూ వచ్చాము అని భావిస్తారు. అరే, దానికి కూడా ఏదైనా లెక్క ఉండాలి కదా. మీ గురించి ఎవ్వరికీ తెలియనే తెలియదు. మీరు బ్రహ్మా పిల్లలు. మీరు ఎవరి పిల్లలు అని మిమ్మల్ని అడుగుతారు. అరే, మేము బ్రహ్మాకుమార-కుమారీలము కావున మేము వారి పిల్లలము కదా. బ్రహ్మా ఎవరి సంతానము? శివబాబా సంతానము. మేము వారి మనవలము. ఆత్మలందరూ వారి పిల్లలే. మళ్ళీ శరీరములో మొదట బ్రాహ్మణులుగా అవుతారు. ప్రజాపిత బ్రహ్మా ఉన్నారు కదా. ఇంతమంది ప్రజలను ఎలా రచిస్తారు, ఇది మీకు తెలుసు. ఇది దత్తత తీసుకోవడము. శివబాబా బ్రహ్మా ద్వారా దత్తత తీసుకుంటారు. మేళా కూడా జరుగుతుంది. వాస్తవానికి ఎక్కడైతే బ్రహ్మపుత్రా నది సాగరంలోకి వెళ్ళి కలుస్తుందో అక్కడ మేళా జరగాలి. ఆ సంగమములో మేళా జరగాలి. ఈ మేళా ఇక్కడ ఉంది. ఇక్కడ బ్రహ్మా కూర్చున్నారు, వీరు తండ్రి కూడా మరియు పెద్ద మమ్మా (పెద్ద తల్లి) కూడా వీరేనని మీకు తెలుసు. కానీ వీరు పురుషుడు, అందుకే - నీవు ఈ మాతలను సంభాళించు అని మమ్మాను నిమిత్తం చేయడం జరుగుతుంది. తండ్రి అంటారు, నేను మీకు సద్గతిని ఇస్తాను. ఈ దేవతలు డబుల్ అహింసకులని మీకు తెలుసు, ఎందుకంటే అక్కడ రావణుడు ఉండడు. భక్తి ద్వారా రాత్రి అవుతుంది మరియు జ్ఞానం ద్వారా పగలు అవుతుంది. జ్ఞానసాగరుడు ఒక్క తండ్రే, వారినే మళ్ళీ సర్వవ్యాపి అని అనేస్తారు. తండ్రే వచ్చి ఇది అర్థం చేయిస్తారు మరియు ఇది పిల్లలకే అర్థం చేయిస్తారు. శివ భగవానువాచ అని ఉంది కదా. శివ జయంతిని జరుపుకుంటున్నారంటే తప్పకుండా వారు ఎవరిలోకో వస్తారు కదా. నేను ప్రకృతి యొక్క ఆధారాన్ని తీసుకోవలసి ఉంటుంది అని అంటారు. నేను చిన్నపిల్లవాని ఆధారమునేమీ తీసుకోను, శ్రీకృష్ణుడైతే చిన్నపిల్లవాడు కదా. నేనైతే అతని అనేక జన్మల అంతిమములో, అది కూడా వారి వానప్రస్థావస్థలో ప్రవేశిస్తాను. వానప్రస్థావస్థ తర్వాతనే మనుష్యులు భగవంతుడిని స్మరిస్తారు. కానీ భగవంతుని గురించి యథార్థంగా ఎవ్వరికీ తెలియదు. అందుకే తండ్రి అంటారు - యదా యదాహి... నేను భారత్ లోకే వస్తాను. భారత్ మహిమ అపారమైనది.

నేను ఫలానాను, నేను ఇది అంటూ మనుష్యులకు దేహ అహంకారము ఎంతగా ఉందో చూడండి! ఇప్పుడు తండ్రి వచ్చి మిమ్మల్ని దేహీ-అభిమానులుగా తయారుచేస్తారు. మధురాతి-మధురమైన ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి కూర్చొని జ్ఞానము యొక్క రహస్యాలన్నింటినీ తెలియజేస్తారు. ఇది పాత ప్రపంచము. సత్యయుగము కొత్త ప్రపంచము. సత్యయుగములో ఆది సనాతన దేవీ-దేవతా ధర్మమే ఉండేది. ఇది 5,000 సంవత్సరాల విషయము. కానీ శాస్త్రాలలో వ్యాసుడు - కల్పము ఆయువు లక్షల వేల సంవత్సరాలని వ్రాసేశారు. వాస్తవానికి ఇది 5,000 సంవత్సరాల కల్పము. మనుష్యులు పూర్తిగా అజ్ఞానపు కుంభకర్ణుని నిద్రలో నిదురిస్తూ ఉన్నారు. ఇప్పుడు మీ ఈ విషయాలను ఎవరైనా కొత్తవారు వింటే అర్థం చేసుకోలేరు. అందుకే తండ్రి అంటారు - కావుననే నేను నా పిల్లలతోనే మాట్లాడతాను. భక్తిని కూడా మీరే ప్రారంభిస్తారు. మీకు మీరే చెంపదెబ్బ వేసుకున్నారు. తండ్రి మిమ్మల్ని పూజ్యులుగా తయారుచేసారు, మీరు మళ్ళీ పూజారులుగా అయిపోతారు. ఇది కూడా ఒక ఆట. కొంతమంది వ్యక్తులు సున్నితమైన మనసు కలిగినవారైతే నాటకాన్ని చూసి కూడా ఏడ్చేస్తారు. ఎవరైతే ఏడుస్తారో వారు పోగొట్టుకున్నట్లే అని తండ్రి అంటారు. సత్యయుగములో ఏడ్చే విషయమే ఉండదు. అలాగే ఇక్కడ కూడా ఏడవకూడదు అని తండ్రి అంటారు. ద్వాపర, కలియుగాలలో ఏడుస్తారు. సత్యయుగం వారు ఎప్పుడూ ఏడవరు. చివరి సమయంలో ఎవరికీ ఏడ్చేందుకు తీరికే ఉండదు. అకస్మాత్తుగా మరణిస్తూ ఉంటారు. అయ్యో రామా అని కూడా అనలేరు. వినాశనం ఎలా జరుగుతుందంటే, అందులో కొద్దిగా కూడా దుఃఖము కలగదు ఎందుకంటే హాస్పిటళ్ళు మొదలైనవైతే ఉండవు కావున వినాశన సామాగ్రిని కూడా అటువంటివాటినే తయారుచేస్తారు. తండ్రి అర్థం చేయిస్తున్నారు - రావణుడిపై విజయాన్ని పొందేందుకు నేను కోతులైన మీ సైన్యాన్ని తీసుకుంటాను. రావణుడిపై విజయాన్ని ఎలా పొందాలి అని తండ్రి ఇప్పుడు మీకు యుక్తిని తెలియజేస్తారు. సీతలందరినీ రావణుడి సంకెళ్ళ నుండి విడిపించాలి. ఇవన్నీ అర్థం చేసుకోవలసిన విషయాలు. భగవానువాచ, పిల్లలకే తండ్రి చెప్తారు, చెడు వినకండి... ఏ విషయాలలోనైతే మీకు ఎటువంటి లాభమూ లేదో వాటి నుండి మీరు మీ చెవులను మూసేసుకోండి. ఇప్పుడు మీకు శ్రీమతము లభిస్తుంది. మీరే శ్రేష్ఠముగా అవుతారు. ఇక్కడైతే శ్రీ శ్రీ అన్న టైటిల్ ను అందరికీ ఇచ్చేసారు. అచ్ఛా. అయినా తండ్రి అంటారు - స్వయాన్ని ఆత్మగా భావించండి మరియు తండ్రిని స్మృతి చేయండి. ఇది ఎంత అద్భుతమైన ఓటమి-గెలుపుల అనంతమైన నాటకము, దీనిని తండ్రే అర్థం చేయిస్తారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. తండ్రి సమానంగా దయార్ద్ర హృదయులుగా అవ్వాలి. అందరినీ దుఃఖాల నుండి విడిపించి పతితుల నుండి పావనులుగా తయారుచేసే సేవను చేయాలి. పావనంగా అయ్యేందుకు ఒక్క తండ్రి పట్ల చాలా-చాలా ప్రేమను ఉంచాలి.

2. తండ్రి అంటారు - ఎవరైతే ఏడుస్తారో, వారు పోగొట్టుకున్నట్లే, అందుకే ఎటువంటి పరిస్థితిలోనూ మీరు ఏడవకూడదు.

వరదానము:- స్వయం యొక్క రాజ్యం ద్వారా తమ సహచరులను స్నేహీలుగా, సహయోగులుగా చేసే మాస్టర్ దాతా భవ

రాజు అనగా దాత. దాతకు చెప్పాల్సిన అవసరము లేక అడగాల్సిన అవసరము ఉండదు. ప్రతి ఒక్కరూ స్వయమే రాజులకు తమ స్నేహపు కానుకలను ఆఫర్ చేస్తారు. మీరు కూడా స్వయముపై రాజ్యం చేసే రాజుగా అయినట్లయితే ప్రతి ఒక్కరూ మీ ముందు సహయోగమనే కానుకను ఆఫర్ చేస్తారు. ఎవరికైతే స్వయముపై రాజ్యం ఉంటుందో, వారి ముందు లౌకిక-అలౌకిక సహచరులు - జీ హాజిర్, జీ హజూర్, హాజీ (సరేనండీ, సరేనండీ) అంటూ స్నేహీలుగా, సహయోగులుగా అవుతారు. పరివారానికి ఎప్పుడూ ఆర్డర్ చేయకండి, మీ కర్మేంద్రియాలను ఆర్డర్ లో ఉంచుకోండి, అప్పుడు మీ సహచరులందరూ మీకు స్నేహీలుగా, సహయోగులుగా అవుతారు.

స్లోగన్:- సర్వ ప్రాప్తుల సాధనాలు ఉన్నా కూడా వృత్తి ఉపరామంగా ఉంటే, అప్పుడు వైరాగ్య వృత్తి కలవారు అని అంటారు.